క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సత్తెనపల్లి: మరమ్మతుల దృష్ట్యా పట్టణంలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. ఈ మేరకు ఏఈ పీబీ కిరణ్ శుక్రవారం తెలిపారు.

ముప్పాళ్ల: మండలంలోని అన్ని గ్రామాల్లోనూ శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ జి.సుచరిత శుక్రవారం తెలిపారు.

రాజుపాలెం: మండలంలోని అన్ని గ్రామాలలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ కోట పెదమస్తాన్ శుక్రవారం తెలిపారు.

బెల్లంకొండ: బెల్లంకొండ, పాపాయపాలెం సబ్ స్టేషన్ల పరిధిలోని పలు గ్రామాలలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపోనుంది.

పెదకూరపాడు: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉదయం 8 – మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ దాసరి రామకృష్ణ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. పెదకూరపాడు, 75 త్యాళ్ళూరు సబ్‌స్టేషన్‌ల పరిధిలోని 20 గ్రామాల్లో అంతరాయం ఉంటుందన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

అమరావతి: గర్భిణులు పౌష్టికాహారంతోపాటు వైద్యుల సూచనలు కూడా పాటించాలని పెదకూరపాడు శాసనసభ్యుడు భాష్యం ప్రవీణ్ అన్నారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో జన చైతన్య సమితి ఆధ్వర్యంలో స్కానింగ్, వివిధ పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి వచ్చిన 50 మంది గర్భిణులకు శుక్రవారం ఎమ్మెల్యే చేతుల మీదుగా పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పౌష్టికాహారాన్ని అందిస్తున్న జన చైతన్య సమితి నిర్వాహకులు అభినందనీయులన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సంఘీభావ ర్యాలీ



నకరికల్లు: దేశ రక్షణలో పాల్గొంటున్న సైనికులు అందరికీ ఆదర్శమని సత్తెనపల్లి రూరల్ సీఐ పి.కిరణ్ అన్నారు. యుద్ధానికి సంఘీభావ, మద్దతు ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి చౌత్రా సెంటర్ వరకు జాతీయజెండాలు చేతబట్టి ర్యాలీ నిర్వహించారు. మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుద్ధంలో పాల్గొంటున్న వారికి భారతీయులుగా అందరం మద్దతుగా నిలవాలన్నారు. దేశ సైనికుల దేశభక్తి, పోరాట పటిమను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ చల్లా సురేష్, హెడ్ కానిస్టేబుల్ నారాయణ, సిబ్బంది సుబాని , గ్రామస్థులు పాల్గొన్నారు.

14న ఉద్యోగ మేళా



సత్తెనపల్లి: హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ఉద్యోగ మేళా పట్టణంలోని సాయి కృష్ణ థియేటర్ ఎదుట టీచర్స్ మస్తాన్ ఐటీఐ కళాశాలలో ఈ నెల 14వ తేదీన నిర్వహించనున్నారు. ఈ మేరకు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు శుక్రవారం తెలిపారు. 18 –నుండి 35 ఏళ్లు ఉన్న వారు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పాలిటెక్నిక్, బీటెక్ (పాస్/ఫెయిల్), ఐటీఐ చదివిన వారు పాల్గొనవచ్చన్నారు. మేళాలో 10 కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. దాదాపు వెయ్యి మందికిపైగా ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 14న ఉదయం 10.30 గంటలలోపు హాజరు కావాలని పేర్కొన్నారు. వివరాలకు 90306 89949, 82472 19351 ఫోను నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఆహారంతోపాటు ఆరోగ్య సూత్రాలూ ముఖ్యం



పెదకూరపాడు: గర్భిణులు ఆరోగ్య సూత్రాలతో పాటు పౌష్టికాహారం కూడా తీసుకోవాలని డాక్టర్ కూచిపూడి సుజాత సూచించారు. ప్రతి నెల 9వ తేదీన జరిగే పరీక్షలకు వచ్చిన గర్భిణులు, బాలింతలకు ఆమె శుక్రవారం అవగాహన కల్పించారు. తల్లీబిడ్డలు క్షేమంగా ఉండాలన్నా, సుఖప్రసవం జరగాలన్నా తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని కోరారు. మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి నెల పౌష్టికాహారం అందిస్తున్నారన్నారు. భవిష్యత్ తరాలు ఆరోగ్యంగా ఉండాలంటే తప్పనిసరిగా ఆహార అలవాట్లు మార్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాగులూరి ఫౌండేషన్ నిర్వాహకులు మాగులూరి కృష్ణారావు, కొండవీటి ప్రసాద్, కుంచనపల్లి కిరణ్‌కుమార్, వైద్యులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో స్వచ్ఛ సత్తెనపల్లి

- కాలువలపై ఆక్రమణలుంటే సహించేది లేదు
- సత్తెనపల్లి మున్సిపల్ కమిషనర్ ఆనంద్‌కుమార్
- పట్టణంలోని పలు ప్రాంతాల్లో పరిశీలన



కూరగాయల వ్యాపారులతో మాట్లాడుతున్న ఆనంద్ కుమార్

సత్తెనపల్లి: స్వచ్ఛ సత్తెనపల్లికి పట్టణ ప్రజలు అందరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ఎస్. ఆనందకుమార్ అన్నారు. పట్టణంలోని రాజీవ్ గాంధీ కూరగాయల మార్కెట్ ముందు వైపు ఏర్పాటు చేసిన ఆక్రమణలను శుక్రవారం ఆయన పరిశీలించారు. రోడ్లు, కాలువలను ఆక్రమిస్తే సహించేది లేదని, ఈ విధంగా రోడ్ల మీద వాహనాలు, ఆటోలు నిలిపితే ప్రజలు రాకపోకలు ఎలా సాగిస్తారని అసహనం వ్యక్తం చేశారు. మున్సిపల్ స్థలం పరిధి హద్దు దాటి డ్రైయిన్ మీదకు బయటికి వచ్చి ఆక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. మార్కెట్‌లో నిషేధిత పాలిథిన్ కవర్లను వినియోగించరాదని, ప్రతి దుకాణదారుడు సొంతంగా డస్ట్ బిన్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. వ్యర్థాలను డస్ట్‌బిన్‌లో వేసి పారిశుధ్య కార్మికులకు అందించాలని పేర్కొన్నారు. వడ్డవల్లి శ్రీ రామాలయం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయానికి వెళ్లే దారిలో కుడివైపున పారిశుధ్యం అధ్వానంగా ఉండటంతో పరిశీలించారు. మార్కెట్‌లో వ్యర్థాలను ఈ ప్రాంతంలో వేయరాదని మార్కెట్ కమిటీ సభ్యులకు సూచించారు. పట్టణంలోని తాలూకా సెంటర్‌లో ప్రభుత్వ చలివేంద్రంలో గురువారం కురిసిన వర్షానికి బురదమయం కావడంతో పారిశుధ్య సిబ్బందిచే శుభ్రం చేయించారు. నరసరావుపేట రోడ్‌లోని చెక్‌పోస్ట్ ప్రాంతం, వెంకటపతి కాలనీ, అపార్ట్‌మెంట్ పరిసర ప్రాంతాలు పరిశీలించారు. అపార్ట్‌మెంట్ ఎదురుగా ఉన్న పాత ఐరన్ దుకాణం వద్ద రోడ్డు మీదకు ఉన్న పాత సామాన్లను పరిశీలించి లోపలే ఉంచాలన్నారు. మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయసారథి, తదితరులు ఆయన వెంట ఉన్నారు.

బాల్య వివాహాలతో అనారోగ్యం



కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎం.అనంతలక్ష్మి



దొడ్లేరులో అవగాహన కల్పిస్తున్న దృశ్యం



అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

ముప్పాళ్ల: బాల్య వివాహాల వలన అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.అనంత లక్ష్మి చెప్పారు. మండల కేంద్రమైన ముప్పాళ్ళలోని అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర వికాసం కార్యక్రమం శుక్రవారం జరిగింది. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనంతలక్ష్మి పాల్గొన్నారు. చిన్న వయసులో గర్భధారణ, పునరుత్పత్తి, ఆరోగ్య సమస్యలు, ఇతర ప్రమాదాల గురించి అవగాహన కల్పించారు. పిన్న వయసులో గర్భం ధరించడం వలన శిశుమరణాలతోపాటుగా జీవిత కాల ఆరోగ్య సమస్యలు తప్పవని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా బాల్యవివాహాలపై రూపొందించిన కరపత్రాన్ని అందించారు. ఏఎన్‌ఎం ఎ.జ్యోతి, అంగన్‌వాడీ కార్యకర్తలు రాజ్యలక్ష్మి, కమల, సచివాలయ మహిళా పోలీసు కె.కోటమ్మ, కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

క్రోసూరు: మండలంలోని మూడు ఐసీడీఎస్ సెక్టార్లల్లోని అంగన్‌వాడీ కేంద్రాలలో శుక్రవారం కిశోరి బాలికల వికాసంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. క్రోసూరు సెక్టార్‌లో ఎస్టీకాలనీలో దొడ్లేరు సెక్టార్‌లోని గ్రామంలో, 88 త్యాళ్లూరు సెక్టార్‌లోని గ్రామంలో కార్యక్రమాలు కొనసాగాయి. బాల్య వివాహాలు, బాలికల అక్రమ రవాణా, అత్యాచారాలు, వ్యక్తిగత పరిశుభ్రత తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆయా సెక్టార్ల సూపర్‌వైజర్లు మాధవి, బి.రత్నకుమారి, మైమున్నీసా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పెదకూరపాడు: బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలు, ఆహార అలవాట్లపై పెదకూరపాడు సెక్టార్‌లోని అంగన్‌వాడీ కార్యకర్తలు సూపర్‌వైజర్ షేక్ మున్ని ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేశారు. పెదకూరపాడులో కిషోరి వికాసంలో భాగంగా చిన్నారుల చేతులపై బాల్యవివాహాలు వల్లన కలిగే నష్టాలు, పౌష్టికార లోపంతో కలిగే అనారోగ్యాలపై గోరింటాకుతో నినాదాలు రాశారు. శుక్రవారం పెదకూరపాడు–3 అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి బాలికలు, తల్లిదండ్రులకు వారు అవగాహన కల్పించారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం

వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి ఇన్‌చార్జి డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి



సయ్యద్ పెద్ద వలికి నివాళులర్పిస్తున్న గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి, భవనం రాఘవరెడ్డి

నకరికల్లు: కార్యకర్తల కుటుంబాలకు పార్టీ తరఫున అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ సత్తెనపల్లి ఇన్‌చార్జి డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి భరోసా ఇచ్చారు. స్థానిక బంగ్లాగడ్డకు చెందిన సయ్యద్ పెద్ద వలి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి శుక్రవారం గ్రామానికి చేరుకొని ఆయన భౌతికకాయం వద్ద నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి, దూదేకుల బాషా, సలీల్, శాగం చంద్రశేఖర్‌రెడ్డి, షేక్ బాజీ, సుభాని, సైదా, పాలూరి రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముప్పాళ్ళ ఎంపీడీవోగా రత్నం



ముప్పాళ్ల: ముప్పాళ్ళ ఎంపీడీవోగా పి.రత్నం శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆ మేరకు ఇన్‌చార్జి ఎంపీడీవో జి.కాశయ్య నుంచి బాధ్యతలు తీసుకున్నారు. దాచేపల్లి ఎంపీడీవో కార్యాలయం సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ పదోన్నతిపై రత్నం ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి, అభినందనలు తెలిపారు. అనంతరం కార్యాలయ సిబ్బందితో ఎంపీడీవో సమావేశం నిర్వహించారు.

ట్రాక్‌పై విరిగిపడిన చెట్టు



సత్తెనపల్లి: పట్టణంలోని రైల్వే స్టేషన్‌రోడ్‌లోని వాకింగ్ ట్రాక్ పై గురువారం కురిసిన భారీ వర్షానికి పెద్ద చెట్టు విరిగిపడి నడక దారులకు ఇబ్బందిగా మారింది. ట్రాక్ పై అడ్డంగా పడి ఉన్న చెట్టును తక్షణమే మున్సిపల్ అధికారులు తొలగించి ఇబ్బంది లేకుండా చూడాలని పలువురు శుక్రవారం కోరారు.

12న బుద్ధ జయంతి వేడుకలు

అమరావతి: బుద్ధ జయంతి సందర్భంగా ఈ నెల 12వ తేదీన యోగాశ్రమంలో వేడుకలను నిర్వహించనున్నట్లు ధాన్యకటక బుద్ధ విహార ట్రస్టు చైర్మన్ డాక్టర్ వావిలాల సుబ్బారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుద్ధుడి బోధనలు భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. అమరావతి స్తూపం వద్ద 12వ తేదీన ఉదయం 9 గంటలకు బుద్ధ జయంతిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. సాయంత్రం 6 గంటలకు యోగాశ్రమంలో బౌద్ధ ధర్మ సందేశం తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు.

బాలికల భవితకు బాటలు



మాట్లాడుతున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ప్రమీల

సత్తెనపల్లి: కౌమార దశలో బాలికల అనారోగ్య సమస్యలు, ఇతర ఇబ్బందుల పరిష్కారం కోసం ప్రభుత్వం కిశోరి వికాసం పేరుతో ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పి.ప్రమీల అన్నారు. సత్తెనపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో గల పట్టణంలోని 17, 18వ వార్డుల్లో ఈ కార్యక్రమంలో భాగంగా సీజన్–3లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బాలికల్లో ఆత్మస్థైర్యం పెంపొందించేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. వేసవిలో బాలికలకు ఉపయోగపడేలా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సామాజిక అంశాలపై చైతన్యవంతులను చేస్తున్నామన్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎస్.స్వర్ణలత మాట్లాడుతూ.. ఇతర శాఖల సమన్వయంతో సామాజిక అంశాలతోపాటు విద్య, వైద్యం, నైపుణ్యం, క్రీడలు, చట్టాలు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ లక్ష్మి తిరుపతమ్మ, వార్డు సచివాలయం ఏఎన్‌ఎం గోవిందమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు డి.శాంతకుమారి, ఎస్.సెలీనారాణి తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు సకాలంలో వేతనాలివ్వాలి



సత్తెనపల్లి: ఉపాధి హామీ పథకం కూలీలకు ప్రతి వారం సకాలంలో వేతనాలు అందేలా చూడాలని వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి గంజిమాల రవిబాబు కోరారు. ఆయన సత్తెనపల్లి మండలం భృగుబండ, రెంటపాళ్ల గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం పరిశీలించారు. కూలీలతో ముచ్చటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కూలీల సమస్యలు పరిష్కరించాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి జమండ్లమూడి భగత్, మండల నేత జమండ్లమూడి మరియదాసు ఉన్నారు.

యువతి అదృశ్యం

క్రోసూరు: మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి అదృశ్యమైంది. ఈ నెల 7వ తేదీ రాత్రి ఈ ఘటన జరిగిందని తండ్రి శుక్రవారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ పి.రవిబాబు తెలిపారు. యువతి మిస్సింగ్ కేసుగా నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు క్రోసూరు ఎస్ఐని 94407 96235, క్రోసూరు పోలీసు స్టేషన్‌ను 08640–227133 నంబర్‌లలో సంప్రదించాలని కోరారు.

బాల్య వివాహాలు శిక్షార్హం

బెల్లంకొండ: బాల్య వివాహాలు చేస్తే బాధ్యులందరూ శిక్షార్హులు అవుతారని క్రోసూరు ప్రాజెక్ట్ ఐసీడీఎస్ సీడీపీవో సరళ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో కిశోరి వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ బాల్యవివాహాల అనర్థాల గురించి తెలిపారు. చట్టం ప్రకారం 18 సంవత్సరాలు నిండిన తర్వాతే అమ్మాయికి వివాహం చేయాలని సూచించారు. బాల్య వివాహాల వల్ల ఎన్నో అనర్థాలు జరుగుతాయని చెప్పారు. ప్రసూతి మరణాలు, శిశు మరణాలు సంభవిస్తాయని తెలిపారు. మండల ఆయుర్వేద వైద్యులు ఆర్.శ్రీనివాస్ మాట్లాడుతూ చిన్న వయసులో గర్భం దాల్చడం వల్ల రక్తహీనత, బిడ్డ ఎదుగుదల లేకపోవడం వంటివి సంభవిస్తాయని తెలిపారు. అనంతరం లింగ వివక్ష, బాలల హక్కులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పరిమళ, వనజ, అంగన్ వాడీ కార్యకర్తలు ఆయేషా, పార్వతి, నాగేంద్రం, సుజాత, యోగా టీచర్ కోటేశ్వరమ్మ, వెంకటరామయ్య ఏఎన్‌ఎం మధులత, సచివాలయ సిబ్బంది గోపి పాల్గొన్నారు.



క్షయవ్యాధిపై అవగాహన కల్పించాలి



రాజుపాలెం: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సిబ్బందికి టీబీ ముక్తా అభియాన్ శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. డాక్టర్ రవితేజ నాయక్ మాట్లాడుతూ క్షయ వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజల్లో అవగాహన కల్పించారు. బాధితుల కుటుంబ సభ్యులకు, ఇతరులకు వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం సాక్షం కోర్సెస్ యాప్‌ను సిబ్బందితో డౌన్‌లోడ్ చేయించారు. ప్రతి ఆరోగ్య కార్యకర్త గ్రామాలలో విస్తృతంగా క్షయవ్యాధిపై అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ పాల్ రవి, సూపర్‌వైజర్ జీవన్‌రావు, హెల్త్ విజిటర్ ఉషారాణి, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న వై.రాధాకృష్ణ

నకరికల్లు: ఈ నెల 20వ తేదీన చేపట్టబోయే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కౌలు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.రాధాకృష్ణ పిలుపునిచ్చారు. కార్మిక సంఘాల నాయకులతో స్థానిక భగత్‌సింగ్ కార్యాలయంలో శుక్రవారం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం అనుసరించే రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసనగా దేశవ్యాప్తంగా ఈ నెల 20న నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. సమాన పనికి సమాన వేతనంతోపాటు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలన్నారు. రైతాంగానికి కనీస మద్దతు ధర గ్యారంటీ చట్టం అమలు చేయాలన్నారు. కౌలు రైతులకు రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని అందించాలని తెలిపారు. గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డుదారులందరికీ పని కల్పించడంతోపాటు వేసవి అలవెన్స్‌లు అమలు చేయాలన్నారు. వ్యవసాయంలో మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలకు కార్మికులు, రైతులు ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఈపూరి లక్ష్మారెడ్డి, కౌలు రైతు సంఘం నాయకులు జి.పిచ్చారావు, భవన నిర్మాణ కార్మికుల సంఘం నాయకుడు గోదా వెంకట రమణ, మహిళా సంఘం నాయకురాలు గాదె కుమారి, ఆశా వర్కర్‌లు పాల్గొన్నారు.

కార్మికులకు భద్రత కల్పించాలి



సదస్సులో మాట్లాడుతున్న ముబారక్

సత్తెనపల్లి: కార్మికులపై పని ప్రదేశాల్లో ఎటువంటి వివక్ష ఉండరాదని, వారికి తగిన భద్రత కల్పించాలని పారా లీగల్ వలంటీర్ షేక్ ముబారక్ అన్నారు. కార్మిక వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా సత్తెనపల్లి మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి వి. విజయ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని రైల్వే స్టేషన్ ప్రాంగణంలో రైల్వే ఆటో యూనియన్ కార్మికులకు న్యాయ అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముబారక్ మాట్లాడుతూ కార్మిక చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్మిక శాఖ ఉద్యోగి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ శాఖ ఇచ్చే లేబర్ కార్డులు వల్ల ప్రయోజనాలు, ప్రమాదం జరిగినప్పుడు ఇన్సూరెన్స్ ఎలా వస్తుంది, కర్మాగార కార్మికులు తీసుకోవలసిన జాగ్రత్తలు, మండల న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందడం వంటి విషయాల గురించి వివరించారు. కార్యక్రమంలో పారా లీగల్ వలంటీర్ షేక్ ఖాజావలి, రైల్వే ఆటో యూనియన్ ప్రెసిడెంట్ పఠాన్ రౌఫ్ ఖాన్, ఇతర డ్రైవర్లు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయం



సరకులు, వస్తువులు అందిస్తున్న దృశ్యం

సత్తెనపల్లి: ఖమ్మం ప్రాంతానికి చెందిన షేర్ ద విజన్ స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయం అని మున్సిపల్ కమిషనర్ ఎస్. ఆనంద్ కుమార్ అన్నారు. పట్టణంలోని ఆదరణ అనాథ వృద్ధాశ్రమానికి సంస్థ మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరకులతోపాటు టీవీ, మిక్సీ, కూలర్, గ్యాస్ పొయ్యి, కుర్చీలు, మంచాలు, డైనింగ్ టేబుల్, ఫ్యాన్లు, వాషింగ్ మిషన్, పరుపులు, బెడ్స్, దుస్తులు, దుప్పట్లు శుక్రవారం అందించారు. ముఖ్యఅతిథిగా కమిషనర్ మాట్లాడారు. సంస్థ అందిస్తున్న సేవలను సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. సంస్థ అధ్యక్షుడు నారాయణ మాట్లాడుతూ తమ సేవా కార్యక్రమాలను కరోనా ముందు నుంచి చేస్తున్నామన్నారు. మున్ముందు మరిన్ని సేవా కార్యక్రమాలు చేయనున్నట్లు తెలిపారు. ఆదరణ అనాథ వృద్ధాశ్రమం అధినేత డాక్టర్ కె. ఇంద్రసేన, ఆశ్రమ నిర్వాహకులు కే రిషిత, పెద్దింటి నాగేశ్వరరావులు ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు నారాయణ, మున్సిపల్ కమిషనర్ ఆనంద్ కుమార్‌లను ఘనంగా సన్మానించారు.

శాంతిభద్రతల పరిరక్షణకు పల్లె నిద్ర



ఎర్రబాలెంలో పల్లెనిద్రలో ఎస్ఐ పి.రవిబాబు, స్థానికులు

ఎర్రబాలెం(క్రోసూరు): గ్రామాల్లో శాంతిభద్రతలు కాపాడేందుకు, ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు పోలీసులు పల్లె నిద్ర చేస్తున్నట్లు ఎస్ఐ పి. రవిబాబు అన్నారు. గురువారం రాత్రి క్రోసూరు మండలం ఎర్రబాలెం గ్రామంలో ఆయన పల్లె నిద్ర నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులకు చట్టాలపై అవగాహన కల్పించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. చిన్న విషయాలకు ఆవేశాలకు లోనుకాకుండా సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. సమస్యలుంటే పోలీసులను ఆశ్రయించాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తే 100కి డయల్ చేయాలని సూచించారు. పల్లె నిద్రలో భాగంగా స్థానిక ప్రజలతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సైబర్ నేరాలు జరుగుతున్న విధానం, వాటి నుంచి బయటపడడానికి అప్రమత్తంగా వ్యవహరించాల్సిన తీరు, రోడ్డు భద్రతా నియమాలు తదితర విషయాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలకు పోలీసులు మరింత చేరువగా ఉండేందుకు ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, అసాంఘిక కార్యకలాపాల గురించి కచ్చితమైన సమాచారం తెలుసుకునేందుకు పల్లె నిద్ర కార్యక్రమం తోడ్పడుతుందన్నారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారు హెల్మెట్ విధిగా ధరించాలని పేర్కొన్నారు. తద్వారా ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశం ఉంటుందన్నారు. సైబర్ మోసానికి గురైతే 24 గంటల్లోపు ఫిర్యాదు చేస్తే నేరగాళ్లు దొంగలించబడిన నగదును బదిలీ కాకుండా ఆపడానికి వీలవుతుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా శ్రీనివాస్ నాయక్



బెల్లంకొండ: మండల పరిషత్ కార్యాలయం ఇన్‌చార్జి ఎంపీడీవోగా శ్రీనివాస్ నాయక్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఎంపీడీవోగా విధులు నిర్వహించిన వై. హనుమారెడ్డి పదోన్నతిపై కృష్ణా జిల్లా నీటి యాజమాన్య సంస్థ అధికారిగా వెళ్లారు. కాగా కార్యాలయం సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్ నాయక్‌ను ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఉన్నతాధికారులు నియమించారు.

ఆరోగ్యమే మహా భాగ్యం

బెల్లంకొండ: గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని చంద్రాజుపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి డా.నజీర్ అన్నారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీలో 'ప్రధాన్ మంత్రి సురక్ష మాతృత్వ అభయాన్' కార్యక్రమంలో భాగంగా వివిధ గ్రామాల నుంచి వచ్చిన గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పలు గ్రామాల నుంచి వచ్చిన 70 మందికి మండల టీడీపీ నాయకుడు వెన్నా సీతారామిరెడ్డి భోజనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది, వివిధ గ్రామాల ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

వరిలో పంట కోత ప్రయోగం

బెల్లంకొండ: మండల కేంద్రమైన బెల్లంకొండలో శుక్రవారం వరి పైరులో పంటకోత ప్రయోగాన్ని నిర్వహించినట్లు మండల వ్యవసాయ అధికారి డి.కృష్ణయ్య తెలిపారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ద్వారా గ్రామ రైతు కొండెబోయిన ఉదయశ్రీకి చెందిన పొలంలో పైరును పరిశీలించినట్లు తెలిపారు. 5–5 మీటర్ల విస్తీర్ణంలో పంట కోతను నిర్వహించి ధాన్యం నూర్పిడి చేయగా 13.52 కిలోల తడి ధాన్యం దిగుబడి వచ్చినట్లు తెలిపారు. మర్రి శివారెడ్డి అనే రైతు పొలంలో అదే విస్తీర్ణంలో పంట కోత చేయగా 10.270 కిలోల ధాన్యం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో బీమా కంపెనీ ప్రతినిధి గోపి, అగ్రికల్చర్ అసిస్టెంట్ అయ్యప్ప, రహ్మతుల్లా, రైతులు పాల్గొన్నారు.